సచివాలయం.. సేవలు నిర్వీర్యం

అరకొర సేవలతో ప్రజల అవస్థలు

భీమవరం అర్బన్: పరిపాలనను ప్రజల ముంగిట తెచ్చేందుకు మాజీ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థను కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా నిర్వీర్యం చేస్తోంది. సచివాలయంలో అరకొరగా సేవలు అందడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజలకు పరిపాలన అందుబాటులో ఉండేలా డిజిటల్, వెల్ఫేర్, ఏఎన్ఎం, మత్స్యశాఖ, పశు సంవర్ధక, అగ్రికల్చర్ అసిస్టెంట్లతో పాటు మహిళా పోలీసు తదితర 11 శాఖల ఉద్యోగులను నియమించడమే కాకుండా ప్రతి 50 ఇళ్లకు వలంటీర్ పెట్టి దేశంలో ఎక్కడలేని విధంగా అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలు ద్వారా లబ్ధి పొందేలా సచివాలయ వ్యవస్థను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారు. గ్రామస్తులు మండల కేంద్రాలకు వెళ్లకుండా సచివాలయంలో రేషన్ కార్డులు, బర్త్, డెత్ సర్టిఫికేట్లు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు తదితర 545 సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. అవినీతి అక్రమాలకు తావు లేకుండా అంతా డిజిటలైజేషన్‌తో సచివాలయ వ్యవస్థ పనిచేసింది.

అరకొర సేవలు

కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే వలంటీర్ల వ్యవస్థను, ప్రభుత్వ మద్యం దుకాణంలో పనిచేస్తున్న ఉద్యోగులు, ఇంటింటికీ రేషన్ వ్యవస్థలను తొలగించడంతోపాటు సచివాలయ వ్యవస్థను కూడా నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతోంది. కుల, ఆదాయం, వన్‌బీ తదితర సాధారణ సేవలు మాత్రమే సచివాలయంలో అందుతుండడమే ఇందుకు నిదర్శనం. రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు, ఆరోగ్యశ్రీ కార్డుల జారీలేదు. పింఛన్ లబ్ధిదారుడు చనిపోతే ఆయన భాగస్వామికి స్పౌంజ్ పింఛన్ ఇవ్వడం, రేషన్ స్మార్ట్ కార్డులు ఇవ్వడం తప్ప ఇంకా కొత్తగా చేసింది ఏమిలేదు.


గూట్లపాడులో సచివాలయంలో ఉద్యోగులు లేని దృశ్యం (ఫైల్)

నాడు విమర్శలు చేసి...

టీడీపీ నాయకులు 2019–24 వరకు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లపై అనేక విమర్శలు చేసేవారు. అంతేకాకుండా ఇంటింటికీ వెళ్లి సర్వేలు చేస్తున్నప్పుడు ఎగతాళిగా మాట్లాడేవారు. కానీ నేడు అధికారంలోకి వచ్చాక పింఛన్ల పంపిణీకి సచివాలయ ఉద్యోగులే అవసరమయ్యారు. అంతేగాక ఇటీవల కూటమి ప్రభుత్వం చేపట్టిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో స్టిక్కర్లు అతికించడం దగ్గర నుంచి ఇంటింటి ప్రచారం వరకు వీరినే ఉపయోగించి వారి ఆత్మ గౌరవాన్ని దెబ్బతీస్తున్నారు. దీనిపై సచివాలయ ఉద్యోగులు మండిపడుతున్నారు. మొత్తం మీద సచివాలయ వ్యవస్థను నీరు కార్చేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తుండడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఉద్యోగులు లేక ఇబ్బందులు



కరెంట్ బిల్లు ఎక్కువ వచ్చిందని కూటమి ప్రభుత్వం కొందరికి తల్లికి వందనం సొమ్ము ఇవ్వలేదు. దీంతో వారు సబ్‌స్టేషన్ చుట్టూ కాళ్లు అరిగేలా తిరగారు. అంతేకాకుండా ప్రతి రోజు సచివాలయాలకు దరఖాస్తుదారులు తమ సమస్యలు చెప్పుకుందామని వస్తునప్పటికీ అక్కడ కొందరు ఉద్యోగులే ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారు.

– బేతాళ సంతోష్ కుమార్, వైఎస్సార్ సీపీ మండల యువజన అధ్యక్షుడు, కొమరాడ

వ్యవస్థను నిర్వీర్యం చేయడం దారుణం



అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామస్థాయిలో సచివాలయ వ్యవస్థను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చారు. కరోనా సమయంలో చాలా రాష్ట్రాలు సచివాలయ వ్యవస్థపై పొగిడాయి. కూటమి అధికారంలోకి వచ్చాక సచివాలయంలో వలంటీర్లు, కొన్ని శాఖల ఉద్యోగులను తొలగించి ఈ వ్యవస్థను నిర్వీర్యం చేస్తుంది.

– బోకూరి విజయరాజు, మాజీ సర్పంచ్, ప్రముఖ న్యాయవాది, గొల్లవానితిప్ప

ప్రజల పక్షాన వైఎస్సార్ సీపీ పోరాటం

బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చినిమిల్లి వెంకట్రాయుడు

వీరవాసరం: సమాజంలో పేదరిక నిర్మూలనకు కృషి చేసిన గొప్ప నాయకుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని వైఎస్సార్ సీపీ భీమవరం నియోజకవర్గ ఇన్‌చార్జి చినిమిల్లి వెంకట్రాయుడు అన్నారు. వీరవాసరం మండలంలోని రాయకుదురు, చింతలకోటిగరువు, తోకలపూడి గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇష్టానుసారంగా ఎన్నో అబద్ధపు హామీలు, బూటకపు మాటలు చెప్పి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం జరిగిందన్నారు. అధికారం చేపట్టి 15 నెలలు గడుస్తున్నా హామీలు అమలు చేయకుండా అన్ని వర్గాలను మోసం చేసిందన్నీరు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసిన పార్టీ ఒక వైఎస్సార్ సీపీ మాత్రమే అని అన్నారు. పార్టీ నాయకులు కార్యకర్తలకు ఏ చిన్నపాటి సమస్య వచ్చినా అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతామని వివరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని చోట్లా ధర్నాలు, ఆందోళనను పెద్ద ఎత్తున చేపట్టడం ద్వారా కూటమి ప్రభుత్వం మెడలు వంచాలని పిలుపునిచ్చారు. నూతనంగా ఎంపికైన రాయకుదురు కమిటీ సభ్యులను అభినందించారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చవాకుల సత్యానారాయణ మూర్తి, పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి మానుకొండ ప్రదీప్ కుమార్, గూడూరి ఓంకార్, వైఎస్సార్ సీపీ పార్టీ అధ్యక్షుడు కె.సర్వేశ్వరరావు, గెడ్డం భాస్కరరావు, షేక్ సత్తార్ సాహెబ్, తోకలపూడి సర్పంచ్ వీరవల్లి శ్రీనివాసరావు, జోగి శ్రీనివాసరావు, దాసరి మాణిక్యాలరావు కొమ్మన శ్రీనివాసరావు, వి.సుబ్రహ్మణ్యం, సూరిబాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్రాయుడు

‘అన్నదాత పోరు’తో కూటమి కళ్లు తెరవాలి

వైఎస్సార్ సీపీ ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్

ఆకివీడు: కూటమి ప్రభుత్వం కళ్లు తెరిచే విధంగా అన్నదాత పోరు కార్యక్రమం విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్.నర్సింహరాజు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ చంద్రబాబు రైతు ద్వేషిగా నిరంతరం పాలన చేస్తున్నారన్నారు. ఏడాదిన్నర కూటమి పాలనలో రైతులు ఆర్థికంగా నలిగిపోయారన్నారు. రైతు భరోసా పేరును అన్నదాత సుఖీభవ అంటూ మార్చినా పథకం సక్రమంగా అమలు చేయలేకపోయారన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో రైతులు తీవ్ర ఆర్థిక నష్టానికి గురవుతున్నా పట్టించుకున్న దాఖలాలు లేవని నర్సింహరాజు ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో పండించిన పంటలకు కనీస ధర లభించడంలేదన్నారు. దళారుల బెడద పెరిగిపోయిందన్నారు. కూరగాయలు, పొగాకు, పసుపు, మిర్చి వంటి పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు విలవిలలాడిపోతున్నారన్నారు.


పీవీఎల్ నర్సింహరాజు

యూరియా కోసం అన్నదాత విలవిల

ఎన్నడూ లేని విధంగా యూరియా కోసం అన్నదాతలు విలవిల్లాడుతున్నారని పీవీఎల్ నర్సింహరాజు ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా కోసం బారులు తీరి రైతులు ఆపసోపాలు పడుతుంటే ఎరువులు అధికంగా వాడకండి అంటూ చంద్రబాబు హితవు పలకడం దురదృష్టకరమన్నారు. రైతులకు అవసరమయ్యే ఎరువుల్ని ముందుగా అందుబాటులో ఉంచుకోవాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే సమస్య తీవ్రమైందన్నారు. అన్నదాతకు వెన్ను దన్నుగా వైఎస్సార్‌సీపీ నిలుస్తోందన్నారు. ఈ నెల 9వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టే రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల వద్ద అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేసి ప్రభుత్వం కళ్లు తెరిపించాలని పార్టీ శ్రేణులకు, రైతులకు పిలుపునిచ్చారు.

పంటల బీమా చెల్లించాలి

ఆకివీడు: పంటల బీమా సొమ్ము చెల్లించి రైతుల్ని ఆదుకోవాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మల్లారెడ్డి శేష మోహన రంగారావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పంటల బీమా అందక రైతులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. 2024 ఖరీఫ్ పంట భారీ వర్షాలు, వరదలకు తీవ్రంగా నష్టపోయిందన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో నష్టం మరీ ఎక్కువగా ఉందన్నారు. బుడమేరు వాగు పొంగి ప్రవహించడంతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాతోపాటు, కృష్ణా జిల్లాలోని రైతులు కూడా అధికంగా నష్టపోయారన్నారు. రాష్ట్రంలో రైతులు ఖరీఫ్ పంట నష్టంతో పాటు, వరదలకు కొట్టుకువచ్చిన వ్యర్థాలు, కలుపు మొక్కలు, వంద్రులను తొలగించేందుకు భారీ వ్యయాన్ని భరించారన్నారు. ప్రభుత్వం రూ.10 వేలు మాత్రమే పంట నష్టపరిహారం ఇచ్చి చేతులు దులుపుకుందన్నారు. రబీ సాగుకు రైతులు అప్పులు చేసి సాగు చేయాల్సి వచ్చిందన్నారు. ఏడాది గడిచినా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల్ని ఆదుకోవడంలో తీవ్ర నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నాయన్నారు. పంటల బీమా ఎంత మంజూరు చేశారో కూడా చెప్పలేని స్థితిలో ప్రభుత్వాలున్నాయన్నారు. నష్టపోయిన రైతులందరికీ బీమా వర్తింప జేయాలని శేషమోహనరంగారావు విజ్ఞప్తి చేశారు.


శేషమోహన రంగారావు

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వాడాలి

భీమవరం అర్బన్: రైతులు భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వాడితే సాగులో ఖర్చు ఆదా అవుతుందని ఏడీఏ కేఏఎస్ఎస్ శ్రీనివాసు అన్నారు. మండలంలోని తాడేరు, తుందుర్రు గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో ఆదివారం ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ కేఏఎస్ఎస్ శ్రీనివాసు మాట్లాడుతూ కొందరు రైతులు సాగులో విచక్షణా రహితంగా ఎరువులు వాడటం వల్ల ఖర్చు ఎక్కువ అవుతుందన్నారు. భూసార పరీక్షల ఆధారంగా నత్రజని, భాస్వరము, పొటాషియం తదితర పోషకాల లోపాన్ని గుర్తించి ఆ మేరకు ఎరువులు వాడాలన్నారు. మండల వ్యవసాయాధికారి యర్రంశెట్టి ప్రసాద్ మాట్లాడుతూ వరి సాగులో సరైన యాజమాన్యం పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. అనంతరం రైతులకు సాగుకు సంబంధించి పలు సలహాలు, సూచనలు చేశారు.


తాడేరులో రైతు సేవా కేంద్రంలో మాట్లాడుతున్న ఏడీఏ కేఏఎస్ఎస్ శ్రీనివాస్

ఉచిత వైద్యం, విద్య దూరం చేయడం దారుణం

పెనుమంట్ర: రాష్ట్రంలో పేదవాడికి ఉచిత వైద్యం, విద్యార్థులకు వైద్య విద్య దూరం చేసేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం దారుణమని పెనుమంట్ర జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి మండిపడ్డారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్ సీపీ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కళాశాలలకు అనుమతి తీసుకొచ్చి, ఐదు కళాశాలలను పూర్తి చేశారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మిగిలిన వాటిని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉండగా వాటిల్లో పది కళాశాలలను ప్రైవేటుపరం చేయడం ఏంటి? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు తన హయాంలో ఒక్క మెడికల్ కాలేజీ కూడా రాష్ట్రానికి తీసుకు రాలేకపోయారని ఆమె విమర్శించారు. కూటమి ప్రభుత్వ అరాచక, రద్దుల పాలనను ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే కాలంలో కూటమి పార్టీలకు ప్రజలే బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతల ఫ్లెక్సీ ధ్వంసం

భీమవరం అర్బన్: యనమదుర్రు గ్రామంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ నేతల ఫ్లెక్సీని కొందరు ఆకతాయిలు శనివారం రాత్రి చింపేసి ధ్వంసం చేశారని ఆ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కొట్టూరి యోషయ్య, పార్టీ నాయకులు ఆదివారం తెలిపారు. ఇటీవల పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త చినిమిల్లి వెంకట్రాయుడు ఆదేశాల మేరకు గ్రామ కమిటీ నియమించారని మేమంతా ఫ్లెక్సీ వేసుకుంటే, ఆకతాయిలు ఈర్ష్యతో చింపేసి ధ్వంసం చేశారన్నారు. ఇప్పటివరకు గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొందని, మరో 3 నెలల్లో పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇలాంటి చర్యలకు పాల్పడడం సబబేనా అని ప్రశ్నించారు. పార్టీలను రెచ్చగొట్టే చర్యలను కూటమి నాయకులు ఖండించాలని కోరారు.


యనమదుర్రులో ఫ్లెక్సీ ధ్వంసం చేసిన దృశ్యం

నవ్వించడంలో దిట్ట రేలంగి నరసింహారావు

భీమవరం: తెలుగు పరిశ్రమలో డైరెక్టర్‌గా రేలంగి నరసింహారావుకు ప్రత్యేక గుర్తింపు ఉందని, ఆయన నవ్వకుండానే ఇతరులను నవ్వించడంలో దిట్ట అని శత చిత్రాల నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యానారాయణ అన్నారు. భీమవరం విచ్చేసిన హాస్య చిత్రాల సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు ను మార్నింగ్ కాఫీ క్లబ్ సభ్యులు ఆదివారం సత్కరించారు. నిర్మాత తుమ్మలపల్లి మాట్లాడుతూ గురువు దాసరి నారాయణ వద్ద అనేక సినిమాలకు అసిస్టెంట్‌గా పని చేసిన తర్వాత రేలంగి నరసింహారావు 70కి పైగా సినిమాలకు దర్శకత్వం వహించారని, తెలుగు, కన్నడ భాషల్లో అనేక హాస్య చిత్రాలు రూపొందించారని అన్నారు. మార్నింగ్ కాఫీ క్లబ్ కన్వీనర్ బొండా రాంబాబు, కోకన్వీనర్ ఓలేటి శ్రీనివాస్ గుప్తా, పీఆర్వో భట్టిప్రోలు శ్రీనివాసరావు, కారుమూరి సత్యనారాయణ, జూలూరి రాజా మాట్లాడుతూ రేలంగి నరసింహారావు దర్శకత్వంలో రూపొందిన మొదటి సినిమా చందమామ అని ఈ హాస్య భరిత సినిమా జనాన్ని విపరీతంగా ఆకట్టుకుందన్నారు. ఆ తర్వాత ఏవండోయ్ శ్రీమతి గారు, ఇల్లంతా సందడి, శోభన్ బాబు నటించిన సంసారం కూడా నవ్వులు పూయించాయన్నారు. అనంతరం రేలంగిని పులవర్తి రామకృష్ణ, కోలేపర్ల సుబ్బారావు, బొండా హనుమంతరావు, బొండాడ మనీష్, కనగర్ల రామకృష్ణ, గాదె నాగేశ్వరావు సభ్యులు సత్కరించారు.


రేలంగి నరసింహారావును సత్కరిస్తున్న మార్నింగ్ కాఫీ క్లబ్ సభ్యులు

ఆహార పదార్థాల నాణ్యతలో రాజీ పడకూడదు

భీమవరం: రంగులు వేయకుండా, టేస్టింగ్ సాల్ట్ కలపకుండా ఆహార భద్రత నిబంధనలు పాటించాలని సహాయ ఫుడ్ కంట్రోలర్ వెంకటరత్నం అన్నారు. భీమవరంలోని స్పైస్ మ్యాజిక్ కాన్ఫరెన్స్ హాలులో భీమవరం హోటళ్ల అసోసియేషన్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వెంకటరత్నం, ఫుడ్ సేఫ్టీ అధికారి సుందరరామిరెడ్డి హాజరయ్యారు. హోటళ్ల నిర్వాహకులు ఫుడ్ లైసెన్సులు తీసుకోవాలన్నారు. హోటళ్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అభిరుచి కాశీరాజు మాట్లాడుతూ ఆహార పదార్థాల నాణ్యతలో రాజీ పడకుండా, అధికారుల సూచనలు పాటించి వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బిర్లా రాజా, కోశాధికారి రమణ భాస్కరరావు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్, కర్రి పాయింట్లు, భోజన హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, క్యాటరింగ్ నిర్వాహకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సహాయ ఫుడ్ కంట్రోలర్ వెంకటరత్నం

ఆర్యవైశ్య విద్యార్థులకు ప్రతిభ అవార్డులు

పెనుగొండ: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని ప్రతిభావంతులైన ఆర్యవైశ్య విద్యార్థులకు ప్రతిభా సన్మాన్–2025 అవార్డులు అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇవ్వనున్నట్లు ట్రస్ట్ ఉపాధ్యక్షుడు బొండాడ రాంపండు తెలిపారు. ఆదివారం పెనుగొండలోని వాసవీ శాంతి ధాంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ విద్యలోనూ, క్రీడల్లోనూ ఆర్యవైశ్య యువతను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో సంస్థ అధ్యక్షుడు డాక్టర్ పీఎస్ గోవిందరాజు, ట్రస్ట్ నిర్ణయించినట్లు వివరించారు. 10వ తరగతి, 12వ తరగతిల్లో 90 శాతానికి పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు, డిగ్రీ, పీజీల్లో డిస్టింక్షన్, అంతకంటే ఎక్కువ మార్కులు, పీహెచ్‌డీ, డాక్టరేట్‌లు సాధించిన వారికి, జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడా గౌరవాలు సాధించిన వారికి అవార్డులు ఇస్తామన్నారు. 2024–25 విద్యాసంవత్సరంలో కోర్సు పూర్తి చేసి ఉండాలన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తులు పూర్తి చేసి, ఆర్యవైశ్య కమ్యూనిటీ ప్రూఫ్‌తో పాటు జిరాక్స్ కాపీలతో సెప్టెంబరు 15 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 99120 18818, 08819-246252 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

భీమవరం: మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా శాస్త్రీయ దృక్పథంతో ఆలోచిస్తూ సమాజ అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని తూర్పు పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తి అన్నారు. జనవిజ్ఞాన వేదిక పశ్చిమగోదావరి జిల్లా 18వ మహాసభలు స్థానిక కలిదిండి రాఘవ రాజు టీచర్స్ హోమ్ (యూటీఎఫ్ జిల్లా కార్యాలయం)లో జేవీవీ జిల్లా అధ్యక్షుడు చింతపల్లి ప్రసాదరావు అధ్యక్షతన ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గోపిమూర్తి మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక ప్రజల్లో దేశభక్తిని పెంపొందించే కార్యక్రమాలను చేపట్టడం, విద్యార్థుల్లో సైన్స్ పట్ల అభిరుచి పెంపొందించే కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. జేవీవీ సీనియర్ నాయకులు ప్రత్తి వీరాస్వామి జేవీవీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈనెల 13, 14 తేదీల్లో విజయనగరంలో జరిగే జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.



మహాసభల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోపి మూర్తి

క్లుప్తంగా

రూ.1.10 లక్షలకు లడ్డూ ప్రసాదం వేలం


దొడ్డనపూడిలో లడ్డూ ప్రసాదం దక్కించుకున్న చందు సిండికేట్ యూత్ సభ్యులు

కాళ్ల: గణపతి నవరాత్రుల వేడుకల ముగింపు సందర్భంగా ఆదివారం పలు గ్రామాల్లో వినాయక నిమజ్జనాలు, అన్నసమారాధనలు ఘనంగా నిర్వహించారు. దొడ్డనపూడి గ్రామంలోని మంచినీటి చెరువు గట్టు వద్ద నిర్వహిస్తున్న గణపతి మహోత్సవాల్లో స్వామివారికి నైవేద్యంగా సమర్పించిన 40 కేజీల లడ్డూ ప్రసాదానికి ఆదివారం సాయంత్రం వేలంపాట నిర్వహించారు. గ్రామానికి చెందిన చందు సిండికేట్ యువకులు రూ.1.10 లక్షలకు లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు. ఈసందర్భంగా యువకులను గ్రామస్తులు అభినందించారు.

లలితా హోమం


ఆలయంలో లలితా హోమం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): భాద్రపద మాసం పౌర్ణమిని పురస్కరించుకుని భీమవరం మెంటే వారి తోటలోని శ్రీబాల త్రిపుర సుందరి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం లలితా హోమం వైభవంగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు కొమ్ము శ్రీనివాస్ అమ్మవారికి ప్రత్యేక పూజలను జరిపారు. ధనరాజ్‌చే అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, వాసంశెట్టి చంద్రశేఖర్, సీతాలక్ష్మి దంపతులచే నవర్చన, కుంకుమార్చన, లలితా హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం వారిని సత్కరించారు.

వైభవంగా కుసుమ హరనాథ కల్యాణోత్సవం


కుసుమ హరనాథులకు గ్రామోత్సవం

ఆకివీడు: స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మందిరంలో కుసుమ హరనాథ కల్యాణోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గత 50 ఏళ్లుగా ఈ ప్రాంతంలో కుసుమ హరనాథ్ జయంతి, కల్యాణోత్సవాల్ని నిర్వహిస్తున్న కాకర్ల దాసు మాట్లాడుతూ కుసుమ హరనాథ్ ఒక ఆధ్యాత్మిక గురువు అని, ఆయన దేవుడు ఎన్ని రూపాల్లో ఉన్న ప్రేమించడం, ఆరాధించడం చేయాలని శిష్యులకు బోధించారని చెప్పారు. తొలుత ప్రత్యేక అలంకరణలో కుసుమ హరనాథ్‌లకు గ్రామోత్సవం జరిపారు. కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి, అలాగే తెలంగాణ, తమిళనాడు, బెంగాల్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు హాజరయ్యారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


ఇందిరమ్మ కాలనీలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం

భీమవరం: శ్రీ చిమటా నారాయణ గౌడ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భీమవరం తాడేరు రోడ్డులోని ఇందిరమ్మ కాలనీలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన సీఐ నాగరాజు మాట్లాడుతూ పేదలు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరంలో డాక్టర్లు సుగర్ స్పెషలిస్ట్ పెద్ది మోహన లక్ష్మీప్రసన్న, కోట్ల సుజల లలిత వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో పెద్ది రమేష్, వీఎస్‌కే డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రమణ, ఇందుకూరి శివాజీ వర్మ, ఎస్‌కే చాన్ బాషా, ఆముదాలపల్లి వాసు, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించారంటూ ఫిర్యాదు

ఉండి: విధులకు ఆటంకం కలిగించారంటూ ప్రభుత్వాధికారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉండి ఎలక్ట్రికల్ ఏఈ పులగం శ్రీనివాసరావు తన కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తుండగా ఈనెల 6వ తేదీ ఉదయం 10:30 గంటల సమయంలో పాములపర్రు గ్రామానికి చెందిన దర్శి బాబీ, దర్శి దేవానందం, సుమారు 35 మంది కార్యాలయానికి చేరుకున్నారు. తమకు చెందిన శ్మశాన వాటికలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తొలగించాలంటూ దర్భాషలాడుతూ తన విధులకు ఆటంకం కలిగించి నిర్బంధించారని ఏఈ శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై ఎండీ నసీరుల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమవరం అర్బన్: భీమవరం ఏపీ ట్రాన్స్‌కో విద్యుత్ ఉపకేంద్రం నుంచి 33/11 కేవీ పెదగరువు విద్యుత్ సబ్ స్టేషన్‌కు వెళ్లే 33 కేవీ లైన్లపై ఆర్‌డీఎస్ఎస్ పనులు, వార్షిక మరమ్మతుల నిమత్తం సోమవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ట్రాన్స్ కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్ వెంకటేశ్వరరావు ఆదివారం తెలిపారు. పెదగరువు, చినగరువు, రాజుల గరువు, వెంప, శ్రీరామపురం, తుందుర్రు, జొన్నలగరువు, దిరుసుమర్రు, పల్లిపాలెం, తుందుర్రు గ్రామాలతో పాటు వీరవాసరం మండలంలోని దూసనపూడి, కమతాలపల్లి, బాలేపల్లి, మత్స్యపురిపాలెం, ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

ఉండి: ఉండి శివారు గోరింతోట ప్రాంతానికి చెందిన ఇరువర్గాలు ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకోవడంతో పోలీసులు కేసులు నమోదు చేశారు. వివరాల ప్రకారం మేడపాటి ఆమోసు అనే వ్యక్తికి కొల్లి సుందరం, ఈది శేఖర్ అనే వారికి ఆస్తికి సంబంధించి గొడవలు జరుగుతుండేవి. దీనిలో భాగంగా గత నెల 22వ తేదీన సుందరం, శేఖర్ ఆమోసు ఇంటిపై దాడి చేసి అతని భార్య రోజా పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినట్లు ఆమోసు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే ఈ నెల 6వ తేదీ సాయంత్రం 4 గంటల సమయంలో మేడపాటి రోజా, ఆమోసు అక్రమంగా ఇంట్లో ప్రవేశించి చంపుతామని కొడుతూ వుండగా కేకలు విన్న బాలమార్తమ్మ అనే మహిళ అడ్డుపడడంతో ఆమెను కూడా దారుణంగా కొట్టి అసభ్యకరంగా ప్రవర్తించారని రాజశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇరువురి ఫిర్యాదులపై ఎస్సై ఎండీ నసీరుల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దాడి ఘటనపై కేసు నమోదు

ఉండి: ఒక వ్యక్తిపై కొందరు దాడి చేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. చెరుకువాడ గ్రామానికి చెందిన కోట అశోక్‌చక్రవర్తి ఈ నెల 6వ తేదీ సాయంత్రం 6:30 గంటల సమయంలో గ్రామంలోని మెడికల్ షాపు వద్ద ఉండగా గ్రామానికి చెందిన పాండిష్‌కుమారుడు మరో నలుగురు వ్యక్తులు కలిసి కొట్టడంతో అతను ప్రభుత్వాసుపత్రిలో చేరాడు. దీంతో ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు ఎస్సై ఎండీ నసీరుల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ధర్నా చేసిన వారిపై కేసు నమోదు

ఉండి: చెరుకువాడలోని మద్యం షాపు ఎదురుగా ధర్నా చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 6వ తేదీ సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు ఎంఎస్ వైన్స్ ఎదురుగా చెరుకువాడ అర్తమూరు రోడ్డుపై యేలేటి యేసురాజు, మార్తమ్మ మరికొందరు రోడ్డుపై బైఠాయించి ట్రాఫిక్‌ను అడ్డుకుని వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించి ధర్నా చేసినట్లు గ్రామ వీఆర్‌ఓ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఎండీ నసీరుల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎరువుల విక్రయ కేంద్రం ఆకస్మిక తనిఖీ

పెనుమంట్ర: ఎరువులు, పురుగుమందులు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే సంబంధిత డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. ఆదివారం ఆయన జుత్తిగ వ్యవసాయ సహకార సంఘంలోని ఎరువుల విక్రయ కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఖరీఫ్ లో రైతుల పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఎరువుల కొరత విక్రయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడ ఎరువులు కొరత లేదని యూరియా పూర్తిగా అందుబాటులో ఉందని రైతులెవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ పంట నమోదు పనులను అధికారులు వేగవంతం చేయాలని, ప్రతి రైతు వివరాలు నమోదు చేయాలని వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా స్థానిక అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలనీ వ్యవసాయ సంచాలకులను ఆదేశించారు. కార్యక్రమంలో నరసాపురం సబ్ కలెక్టర్ దాసిరాజు, మార్టేరు వ్యవసాయ సంచాలకులు ఎంవీ రమేష్, తహసీల్దార్ వైవీ రవికుమార్ వ్యవసాయ శాఖ క్వాలిటీ కంట్రోలర్ వై.రాఘవేంద్రరావు, మండల వ్యవసాయ అధికారి దేవి స్వరూప తదితరులు పాల్గొన్నారు.